www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 17 మార్చి 2024
5
వైఎస్ఆర్

'పది' పరీక్షల పర్యవేక్షణ కట్టుదిట్టం

కడప అర్బన్ : పదవ తరగతి పరీక్షల పర్యవేక్షణ కట్టుదిట్టంగా ఉండాలని జిల్లా పర్యవేక్షణ అధికారి ఎన్.వి కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం డిఇఒ కార్యాలయంలో ఫ్లయింగ్ స్క్వాడ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. కేటాయించిన ప్రతి పాఠశాలను పరీక్షా సమయంలో తప్పనిసరిగా పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. ఎటువంటి ఘటనలకు చోటు లేకుండా పరీక్షలు నిర్వహించే విధంగా చూడాలని ఆదేశించారు. ఏవైనా సంఘటనలు జరిగిన వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారికి, అలాగే పరీక్షల పర్యవేక్షణ అధికారికి వెంటనే తెలియజేయాలని చెప్పారు. పరీక్షా సమయంలో కేటాయించిన పాఠశాలలకు పర్యవేక్షణ చేసేటప్పుడు ఎక్కడైనా కాపీ కాని, మాస్ కాపీ కాని జరిగినట్లయితే వెంటనే సంబంధిత చీఫ్, డిపార్ట్మెంట్, ఇన్విజిలేటర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిఇఒ అనురాధ, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

మోగిన నగారా

- ఏప్రిల్ 18న నోటిఫికేషన్
- 25న నామినేషన్ల స్వీకరణకు చివరి గడువు, 26న పరిశీలన, 29న ఉపసంహరణ
- మే 13న పార్లమెంట్, అసెంబ్లీకి పోలింగ్
- జూన్ 4న కౌంటింగ్



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. కేంద్ర ఎలక్షన్ కమిషన్ శని వారం సాయంత్రం సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు గ్రీన్సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల షెడ్యూలును విడుదల చేసింది. 2024 ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల, మే 13న పోలింగ్, జూన్ నాలుగున కౌంటింగ్ నిర్వహణ చేసున్నట్లు ప్రకటించింది. జిల్లా అధికార యంత్రాంగం ఓటర్ల నమోదు ప్రక్రియ మొదలుకుని సమగ్ర ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఉద్యోగులకు శిక్షణను పూర్తి చేసింది. తాజాగా ఎన్నికల కమిషన్ షెడ్యూలు విడుదల చేసిన నేపథ్యంలో కోడ్ అమల్లోకి వచ్చింది. కడప జిల్లాలో కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్, అన్నమయ్య జిల్లాలో రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లి, తంబళ్లపల్లి, పీలేరు, అసెంబ్లీ నియోజకవర్గాలు, కడప, రాజంపేట పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా రాజకీయ పార్టీలైన అధికార వైసిపి జిల్లాలోని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు టికెట్లు ప్రకటించింది. ప్రతిపక్ష టిడిపి సైతం పార్టీ ధర్మంలో భాగంగా ఒకటి, రెండు అసెంబ్లీలు పార్లమెంట్ స్థానాలు మినహా మిగిలిన అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది.

ఆర్భాటంగా ఆశావహుల ప్రచారం

జిల్లాలో ఆర్భాటంగా ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో అధికార, ప్రతిపక్ష, ఎన్నికల బరిలో నిలిచే ఇతర పార్టీల అభ్యర్థుల ఆర్థిక, అంగ బలాలకు పదును పెడుతున్నారు. ఇప్పటికే పలువురు అభ్యర్థులు కత్తులు దూస్తూ ముందుకెళ్తున్నారు. కడప, ప్రొద్దుటూరు, పులివెందుల నియోజకవర్గాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల మధ్య పరస్పర విమర్శల వర్షం కురుస్తోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా అంతర్గతంగా బుజ్జగింపుల ప్రక్రియ ఊపందుకుంది. రాబోయే రోజుల్లో మరింత ఊపందుకోనుంది. అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ అభ్యర్థులు ఎన్నికల వ్యూహ, ప్రతి వ్యూహాలు, ఎత్తుగడలను వ్యూహాత్మకంగా అమలు చేయడంపై దృష్టి సారించాయి.

హోరాహోరీ...షురూ

జిల్లాలో హోరాహోరీ పోరుకు తెరలేచింది. అధికార వైసిపి కడప జిల్లాలో సిట్టింగులనే బరిలో నిలిపింది. అన్నమయ్య జిల్లాలో రాజంపేట మినహా పాతకాపులకే అవకాశం కల్పించింది. ఎన్నికల సమరాంగణంలో అనుభవజ్ఞులనే దింపింది. ప్రతిపక్ష టిడిపి మైనార్టీ స్థానమైన కడపలో మాధవిని బరిలో నిలిపి అదృష్టాన్ని పరీక్షిస్తోంది. జమ్మలమడుగులో మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి బిజెపి తరుపున బరిలో నిలవనున్న నేపథ్యంలో ఉత్కంఠను కలిగిస్తోంది. ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి టికెట్ లభించడంతో హోరాహోరీ పోటీ నెలకొంది. కమలాపురం, మైదుకూరు అసెంబ్లీ స్థానాల్లో సీనియర్లు, యువతకు అవకాశం ఇవ్వడంతో నువ్వానేనా అనే వాతావరణం నెలకొంది. రాజంపేట టికెట్ టిడిపి అభ్యర్థికి ఇస్తే హోరాహోరీ పోటీ నెలకొనే అవకాశం ఉంది. కడప, రాజంపేట పార్లమెంట్ స్థానాల్లో ఉత్కంఠభరిత పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది. కడప పార్లమెంట్ బరిలో వైఎస్.అవినాష్రెడ్డికి పోటీగా మాజీమంత్రి కీ.శే వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె ఎన్నికల బరిలో దిగే అవకాశాలు ఉన్న నేపథ్యం ఉత్కంఠను కలిగిస్తోంది.

వైసిపి అభ్యర్థులు వీరే

- జిల్లాలోని ఏడు అసెంబ్లీలకు సీనియర్లే
- అన్నమయ్య జిల్లాలో నాలుగింటికీ పాతకాపులే
- రాజంపేటకు ఆకేపాటి, మదనపల్లెకు నిస్సార్
- కడప ఎంపీకి వైఎస్.అవినాష్రెడ్డి
- రాజంపేట ఎంపీకి పెద్దిరెడ్డి మిథున్రెడ్డి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



వైసిపి అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్రెడ్డి వేంపల్లి మండలం ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్ దగ్గర సీనియర్ మంత్రి ధర్మాన ప్రసాదరావు, బాపట్ల ఎంపి నందిగం సురేష్లు రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ, అనకాపల్లి మినహా మిగిలిన 24 పార్లమెంటు టికెట్లను ప్రకటించారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజంపేట, మదనపల్లె మినహా మిగిలిన అభ్యర్థులందరూ సిట్టింగు ఎమ్మెల్యేలకు టికెట్లు కేటాయించారు. కడప, రాజంపేట పార్లమెంట్ టికెట్లు సైతం సిట్టింగు ఎంపీలైన వైఎస్ అవినాష్రెడ్డి, పెద్దిరెడ్డి వెంకట మిధున్రెడ్డికి కేటాయించారు. జిల్లాలోని కడప అసెంబ్లీ టికెట్ డిప్యూటీ సిఎం ఎస్బి అంజాద్బాషా, కమలాపురం పోచిమారెడ్డి రవీంద్రనాథరెడ్డి, మైదుకూరు శెట్టిపల్లి రఘురామిరెడ్డి, ప్రొద్దుటూరుకు రాచమల్లు శివప్రసాద్రెడ్డి, జమ్మలమడుగుకు మూలే సుధీర్రెడ్డి, పులివెందుల వైఎస్ జగన్మోహన్రెడ్డి, బద్వేల్ టికెట్ డాక్టర్ దాసరి సుధకు లభించింది. అన్నమయ్య జిల్లాలో రాయచోటి అసెంబ్లీకి గడికోట శ్రీకాంత్రెడ్డి, రైల్వేకోడూరు కొరముట్ల శ్రీనివాసులు, మదనపల్లికి నిస్సార్ అహ్మద్, పీలేరు చింతల రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి టికెట్లు లభించాయి. రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి టికెట్ను జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డికి టికెట్ లభించడం విశేషం. అధికార వైసిపి 12 విడతలుగా సమన్వయ కర్తలను నియమించింది. కడప, అన్నమయ్య జిల్లాకు చెందిన 13 మందిలో 12 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించకపోవడంతోఊహాగానాలు చోటుచే 0.2ఎసుకున్న సంగతి తెలిసిందే. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన పలువురు స్థానాలను మార్చు తున్నట్లు, వైఎస్ కుటుంబీకులు పోటీ చేయనున్నట్లు సాగిన ఊహాగానాలకు చెక్ పెట్టినట్లు అయింది. తాజాగా అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల టికెట్ల పట్ల స్పష్టత లభించడం, ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో అధికార వైసిపికి చెందిన సిట్టింగు ఎమ్మెల్యేలు ఎన్నికల ప్రోరు పతాకస్థాయి చేరుకోనుంది. ఇప్పటివరకు ప్రతిపక్ష టిడిపి కడప జిల్లా టిడిపి అభ్యర్థులను దశల వారీగా ప్రకటిస్తూ పోయిన సంగతి తెలిసిందే. టిడిపి అభ్యర్థులు సైతం ఎన్నికల ప్రచారాన్ని వ్యూహాత్మకంగా సాగిస్తుండడంతో అధికార వైసిపి అభ్యర్థులు మిన్నకు ఒడిపోయారు. తాజా రాష్ట్రవ్యాప్త టికెట్ల ప్రకటనతో ఎన్నికల సమరాంగణం పూర్తిస్థాయిలో వేడెక్కే అవకాశం ఉందనడంలో సందేహం లేదు.



వై.ఎస్.జగన్మోహన్రెడ్డి పులివెందుల | ఎస్.బి.అంజాద్బాషా కడప | ఎస్.రఘురామిరెడ్డి మైదుకూరు
డాక్టర్ సుధా బద్వేల్ | సుధీర్కుమార్రెడ్డి జమ్మలమడుగు | పి.రవీంద్రనాథరెడ్డి కమలాపురం
రాచమల్లు ప్రసాద్రెడ్డి ప్రొద్దుటూరు | ఆకేపాటి అమర్నాథ్రెడ్డి రాజంపేట | గడికోట శ్రీకాంత్రెడ్డి రాయచోటి
కొరముట్ల శ్రీనివాసులు రైల్వేకోడూరు | నిస్సార్ అహ్మద్ మదనపల్లె | చింతల రామచంద్రారెడ్డి పీలేరు
ద్వారకనాథ్రెడ్డి తంబళ్లపల్లె | వై.ఎస్.అవినాష్రెడ్డి కడప (ఎంపీ) | పెద్దిరెడ్డి మిథున్రెడ్డి రాజంపేట (ఎంపీ)

బిజెపి, ఆర్ఎస్ఎస్ను ప్రజలు క్షమించరు

- సిఎఎ ర్యాలీలో నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

140 కోట్ల మంది భారతీయుల పవిత్ర గ్రంథమైన భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలనుకున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ను భారతీయులు క్షమించరని, బిజెపి ఎత్తుగడలను, కుట్రలను చిత్తుగా ఓడించి తీరుతారని వివిధ రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు. శనివారం సిఎఎ చట్టానికి వ్యతిరేకంగా రాజ్యాంగ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అల్మాస్ పేట సర్కిల్ నుంచి పాత కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా బాబు బాయ్, జి.చంద్రశేఖర్, జి.చంద్ర, మల్లెల భాస్కర్, జాకీర్, మౌలానా, అలీ ఖాన్, సంపత్ కుమార్,సలావుద్దీన్, డాక్టర్ ఓబుల్ రెడ్డి, శివారెడ్డి, చాంద్ బాషా మాట్లాడారు. భారతీయుల పవిత్ర గ్రంథమైన భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 మతం, జాతి, కులం, లింగం లేదా జన్మస్థలం ఆధారంగా పౌరులందరికీ సమానమైన అవకాశాలను విశ్వాసాలను కలిగి ఉండే హక్కును ఇచ్చిందని చెప్పారు. కాని ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న సిఎఎ మౌలిక రాజ్యాంగ లక్ష్యానికి వ్యతిరేకంగా ఉన్నదని తెలిపారు. సిఎఎ చట్టం భారతదేశ పౌరుల హక్కులను హరించడమే కాక, అంతర్జాతీయంగా భారతదేశ ప్రతిష్టను మంటగలిపే విధంగా ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ఎన్నికల కోడ్ నేపథ్యం, మరోవైపు ముస్లిములు ఉపవాసం ఉంటున్న సందర్భంలో సమాజంలో మతవిద్వేషాలు రెచ్చగొట్టి, దేశాన్ని అస్థిరతపరిచే ఉద్దేశంతో బిజెపి సిఎఎ చట్టాన్ని అమలు చేయడానికి నిర్ణయించిందని పేర్కొన్నారు. దీన్ని పోరాటాలతో తిప్పుకొట్టడానికి ప్రజలందరూ సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. మోడీ 10 సంవత్సరాల పాలనలో ప్రజల అభివృద్ధి కోసం ఏం చేశాడో చెప్పి ఓట్లు అడగకుండా అందుకు భిన్నంగా మైనార్టీలను శత్రువులుగా చూపుతూ తన పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకుని మళ్లీ అధికారంలోకి రావాలనే ఉద్దేశంతోనే ఈ సిఎఎ చట్టాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. ప్రజలు బిజెపి ప్రభుత్వ కుట్రలను అర్థం చేసుకోలేనంత అమాయకులు కాదని, కచ్చితంగా బిజెపికి రాజకీయ సమాధి కట్టి తీరుతారని హెచ్చరించారు. రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులను అప్పుల ఊబి నుంచి విముక్తి చేయాలని, ఢిల్లీని చుట్టుముట్టి నాగళ్ళతో సవాల్ విసురుతూ ఉంటే దానికి సమాధానం చెప్పలేక, పరిష్కారాన్ని చూపలేక తప్పించుకుని తిరుగుతున్నారని పేర్కొన్నారు. ఈ రైతు ఉద్యమం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి ఆగ మేఘాల మీద ఎన్నికల ముందు సిఎఎ చట్టాన్ని అమలు చేయడానికి సన్నాహాలు చేయడం ముమ్మాటికీ పిరికిపంద చర్య అన్నారు. ఎన్. వెంకట శివ, రామ్మోహన్ రెడ్డి, ఎం. వి. సుబ్బారెడ్డి, మక్బూల్ బాషా, విజయలక్ష్మి, కె.సి. బాదుల్లా, దస్తగిరి రెడ్డి, చంద్రారెడ్డి, గంగా సురేష్, మనోహర్ రెడ్డి, మద్దిలేటి, వలరాజు, వెంకట్ రాముడు, భాగ్యలక్ష్మి, హమీద్, సుబ్బరాయుడు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కడప నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు

'బత్యాల'కు టికెట్ ఇవ్వకపోతే రాజీనామా చేస్తాం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

రాజంపేట టిడిపి టికెట్ బత్యాల చెంగల్రాయుడుకు ఇవ్వక పోతే ఒంటిమిట్ట మండల టిడిపి కమిటీ మూకుమ్మడిగా నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక హరిత హోటల్లో టిడిపి మండల అధ్యక్షులు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల కమిటీ సభ్యులు మాట్లాడుతూ గతంలో రాజంపేట అసెంబ్లీ నుంచి బత్యాల చెంగల్రాయుడు టిడిపి తరపున పోటీ చేసి ఓటినప్పటికీ ప్రజలు, కార్యకర్తల వెన్నంటే ఉన్నారని చెప్పారు. పార్టీకి ఎన్నడూ ద్రోహం చేయలేదని పేర్కొన్నారు. ఇప్పుడు ఆయనకు టికెట్ ఇవ్వడంలో చంద్రబాబునాయుడు అలసత్వం వహించడం సరైందని కాదన్నారు. ఇలా చేస్తే పార్టీకి ఎంతో నష్టం వాటిల్లే ప్రమాదముందని పేర్కొన్నారు. రాజంపేట నియోజవర్గంలో వైసిపి తొత్తులు కొందరు టిడిపిలో చేరి పార్టీని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. వారి మాటలు నమ్మి చంద్రబాబు ఇలాంటి చర్యలు చేయడం మంచిది కాదని వారు పేర్కొన్నారు. బత్యాల చెంగల రాయుడుకు టిక్కెట్ ఇవ్వకుండా వేరే వారికీ టిక్కెట్ ఇస్తే పార్టీతో కలిసి పనిచేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు నరసింహారెడ్డి, రాష్ట్ర మహిళా కమిటీ సభ్యురాలు ఓబినేని సుబ్బమ్మ, మామిళ్ళ ఈశ్వరయ్య, రాజంపేట పార్లమెంట్ టిడిపి నాయకులు కిరణ్, స్వామి నియోజకవర్గం నాయకులు ఎం.వి రమణ, మైనారిటీ నాయకులు డాక్టర్ జిలాని, రోశయ్య, డాక్టర్ కృష్ణ, హరి ఆంజనేయులు రెడ్డి, అమాన్ ఈశ్వరయ్య, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి మండల నాయకులు

టిడిపి కూటమి విజయం తథ్యం

కడప అర్బన్ : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి విజయం తథ్యమని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస రెడ్డి స్వగృహంలో టిడిపి, జనసేన, బిజెపి నేతల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల అయిందని తెలిపారు. బిజెపి, జనసేన, టిడిపి కలిసి పనిచేసి జగన్ ప్రభుత్వాన్నీ గద్దె దించుతామని చెప్పారు. ఈనెల 17న చిలకలూరిపేటలో ప్రధాని మోడీ, పవన్ కళ్యాణ్, చంద్రబాబు సభకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. బహిరంగ సభ ను విజయవంతం చేయాలని కోరారు. వైసిపి ప్రభుత్వం అన్నీ రంగాల్లో విఫలం అయ్యిందని విమర్శించారు. జగన్ను ఇంటికి పంపడం ఖాయమని తెలిపారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చెన్నూరు

ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని కమ లాపురం శాసనసభ్యులు పి.రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం చెన్నూరులో రూ. 4 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి విలేట్ విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేశామని చెప్పారు. వైద్య సిబ్బంది రోగుల పట్ల స్పందించి వారికి అన్ని పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించాలని ఆయన అన్నారు. అనంతరం చెన్నూరు పంచాయతీ కార్యాలయంలో ఇళ్లపట్టాలు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవానికి సొంత ఇల్లు ఉండాలన్నదే ముఖ్యమంత్రి వై జగన్మోహన్ రెడ్డి ఆశయమని అన్నారు. మండలంలో 881మందికి లబ్ధిదారులకు నిర్మించి పట్టా ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి చర్ల సురేష్ యాదవ్, మండల కన్వీనర్ భాస్కర్ రెడ్డి, అటవీ శాఖ డైరెక్టర్ శ్రీ లక్ష్మి, సర్పంచు సంఘ అధ్యక్షుడు ఎస్వి నారాయణరెడ్డి, చంద్ర యాదవ్, సుదర్శన్ రెడ్డి, సుబ్బయ్య, సొసైటీ ప్రెసిడెంట్ అల్లి శ్రీరామ్మూర్తి, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, నిత్య పూజ, మండల వ్యవసాయ శాఖ అధ్యక్షుడు ఎర్ర సాని మోహన్ రెడ్డి, బలసింగాయ పల్లె భాగ్యమ్మ పెడబల్లె ప్రదీప్ కుమార్ రెడ్డి, ఎమ్మార్వో ప్రకాష్ బాబు, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం శర్మ, డాక్టర్ సతీష్ కుమార్, పంచాయతీ సెక్రెటరీ రామ సుబ్బారెడ్డి, వీఆర్వో శ్రీనివాసులు, సుధీర్ కుమార్, వెంకటసుబ్బయ్య, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కష్టపడి చదివితే ఉన్నత స్థానాలు

బద్వేలు : కష్టపడి చవితే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని సంఘమిత్ర చైర్మన్ పెంచలయ్య పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్సి బాలుర వసతి గృహం-2ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సంఘమిత్ర చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకో వాలని, తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని, భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన పదిమంది విద్యార్థులకు నగదు, ప్రశంసా పత్రం, పూలే, అంబేద్కర్ ల మెమెంటో ఇస్తామన్నారు. కార్యక్రమంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.రామసుబ్బయ్య యాదవ్, ఆవాస్ కమిటీ బద్వేలు పట్టణ అధ్యక్షులు ఎస్. ఏ సత్తార్,దళిత సంఘం నాయకులు ఓ .ఎస్. వి ప్రసాద్,హాస్టల్ వెల్ఫేర్ అధికారి హరికృష్ణ, హాస్టల్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్లో 3 వేల కేసులు పరిష్కారం

కడప : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా 24 బెంచీలు ఏర్పాటు చేసి నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్లో 3 వేల కేసులు పరిష్కరించి 10 కోట్ల ఐదు లక్షల 21 వేల 71 రూపాయలు కక్షిదారులకు చెల్లించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ జి. శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ అదాలత్కులో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా 24 బెంచీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జాతీయ లోక్ అదాలత్లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేసిన న్యాయవాదులకు, రెవెన్యూ సిబ్బందికి, పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి జి.గీత, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రదీప్ కుమార్, ఎక్సైజ్ కోర్టు జడ్జ్ జె.హేమ స్రవంతి, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.నందిని, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.భార్గవి, మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి. విజయలక్ష్మి, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

'సుస్థిర అభివృద్ధి కోసం హోలిస్టిక్ శాస్త్రాల నవీకరణ'

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ నరేష్ అధ్యక్షతన భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వెంకటరావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి సహకారంతో భౌతిక శాస్త్ర అంశమైన 'సుస్థిర అభివృద్ధి కోసం హోలిస్టిక్ శాస్త్రాల నవీకరణ' అనే అంశంపై రెండు రోజుల పాటు జాతీయ సదస్సు శనివారం కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్ రత్నాకరన్, వైవీయూ నుంచి ప్రొఫెసర్ శంకర్ పాల్గొని విద్యార్థులకు, పరిశోధకులనుద్దేశించి హోలిస్టిక్ శాస్త్రాల ఆవశ్యకతను తెలియజేశారు. అనంతరం ముఖ్య అతిథులను మేమెంటో, శాలువాలతో సత్కరించారు. కళాశాలలో కాన్ఫరెన్స్ హాలు దాతల సహకారంతో చక్కగా ఏర్పడటానికి విశేషంగా కృషి చేసిన అధ్యాపకులు యంబడి ఈశ్వరయ్య, జె రవిచంద్ర, జి నరసింహారెడ్డిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎస్. ప్రకాష్ రావు,సదస్సు కో-కన్వీనర్ మధుబాబు, అధ్యాపకులు డాక్టర్ సులోచన, శ్రీధర మూర్తి, శివారెడ్డి,బాబు రవిచంద్ర, అందె శ్రీనువాసులు, పీరయ్య, హరిబాబు, నగేష్, సబిత, పర్వీన్, గురమ్మ, నరసింహా రెడ్డి, మల్లికార్జున, జాకీర్ హుస్సేన్, అల్లాబకాష్, ఇతర కళాశాలల నుంచి లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్

అమరజీవి త్యాగం ఆదర్శనీయం : డిఆర్ఒ

ప్రజాశక్తి - కడప

ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం ప్రాణా లర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం అని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్గౌడ్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్లోని స్పందన హాలులో పొట్టి శ్రీరాములు జయంతి సంస్మరణ సభ డిఆర్ఒ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పట్లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం వరుసగా 58 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి, చివరికి జాతికోసం ప్రాణాలర్పించిన మహనీయులు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. దేశంలోని భాషా ప్రయుక్త రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలిచిన ఆయన మన తెలుగువారని చెప్పుకోవడం గర్వకారణం అన్నారు. మన దేశ స్వాతంత్ర్యం కోసం గతంలో ఎంతోమంది ప్రాణాలర్పించారన్నారు. కార్యక్రమానికి ముందుగా జ్యోతి ప్రజ్వలన, అనంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పలువురు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు అమరజీవి త్యాగనిరతిని కొనియాడారు. కార్యక్రమంలో డిఆర్డిఎ పీడీ ఆనంద నాయక్, స్టెప్ సిఇఒ సాయిగ్రేసి, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ఈరన్న అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.



పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిఆర్ఒ

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం

కడప అర్బన్ : ఆర్గ స్కూల్లో ఆంగ్లం, తెలుగు, హిందీలలో ఇంటర్ స్కూల్ పద్య పోటీలను నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాల విద్యార్థులు 160 మంది పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ శ్రేణులకు నగదు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎంఇఒ పాలెం నారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వనరులను ఉపయోగించుకుని చక్కగా విద్యను అభ్యసించాలని కోరారు. విద్యార్థులు సెల్ఫోన్కు బానిస కాకూడదని చెప్పారు. తల్లిదండ్రులుకు, ఉపాధ్యాయులకు సమాజంలో మంచి పేరు తేవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్తి పాఠశాల డైరెక్టర్ భాగ్యమ్మ, చెమిమియా పేట గర్ల్స్ హై స్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు లక్ష్మీకాంతమ్మ, ఆర్తి స్కూల్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ

కడప అర్బన్ : కృష్ణాపురం, చుట్టుప్రక్కల గ్రామాల పేదల కోసం ఉచిత కళ్యాణమండపం నిర్మించడానికి భూమి పూజ చేసినట్టు కందుల విద్యాసంస్థల ఎండి డాక్టర్ చంద్ర ఓబుల్ రెడ్డి తెలిపారు. శనివారం కళ్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ చేశారు. కందుల మదనమోహన్ రెడ్డి మాట్లాడుతూ 5 నెలలలో కళ్యాణమండపం నిర్మాణం పూర్తి చేసి ప్రజల కోసం వాడుకలోకి తీసుకొని వస్తామని తెలిపారు. పేదల కోసం మండపం నిర్మాణం కందులు శివానంద రెడ్డి ఆశయమని ఆయన సతీమణి కందుల రాజేశ్వరమ్మ తెలిపారు.

అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలి

ప్రజాశక్తి- బద్వేలు

2018 గ్రూప్స్-1 పోస్టుల మెయిన్స్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో బద్వేల్ రూరల్ కార్యదర్శి బాల గురవయ్య నాయకులు సురేష్లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముడియం చిన్ని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని చెప్పారు. ఎపిపిఎస్సి పరీక్షల నిర్వహణ పూర్తి నిర్లక్షమేనన్నారు. ఇందుకు 2018 గ్రూప్స్ మెయిన్స్ రద్దు చేయాలని మళ్ళీ నిర్వహించాలని హైకోర్టు తీర్పే నిదర్శనం అన్నారు. దాదాపు 49 వేల ఒఎంఆర్ షీట్లలో ముల్యాంకణంలో అవకతవకలు ఏర్పడ్డాయని అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో మెయిన్స్ పరీక్ష నే రద్దు చేసిందన్నారు. ఇంత పెద్ద కుంభకోణంలో పెద్దల హస్తం లేనిదే ఇలా జరిగి ఉండదని ఆయన పేర్కొన్నారు. .కష్టపడి కుటుంబాలకు దూరంగా ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లో మగ్గి పరీక్షలు రాస్తే ఇలాంటి సంఘటనలు చర్యలు నిరుద్యోగుల భవిష్యత్ పై పడి బలవన్మరణాలకు దారి తీస్తుందన్నారు. కోర్టు తీర్పు ప్రకారం అరు నెలలో ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	షహరీ
ఆదివారం (సా)	సోమవారం (ఉ)
6.30	5.07

పాడా కార్యాలయం మార్పు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ మినీ సెక్రెటరీయేట్ సముదాయంలోకి పాడా కార్యాలయాన్ని మార్పు చేశారు. ఆ మేరకు శనివారం పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి పూజలు నిర్వహించారు. తన చాంబర్లో సిబ్బందితో కాసేపు ముచ్చటించారు. పాడా కార్యాలయాన్ని ఇక నుంచి మినీ సెక్రటేరియట్‌లోకి మార్చారు. పాడా కార్యాలయ సేవలు ఇక్కడి నుంచే జరుగుతాయని, ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించగలరని కోరారు.

కొత్త కార్యాలయంలో పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి

అటవీ శాఖకు వాటర్ కూలర్ వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక రాణితోపులోని అటవీశాఖకు శనివారం కౌన్సిలర్ కోడి రమణ పులివెందుల మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా వాటర్ కూలర్ వితరణ చేశారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రాణితోపునకు వచ్చే యాత్రికులకు వేసవి దాహార్తి తీర్చుటకు వాటర్ కూలర్ వితరణ చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వల్లపు వరప్రసాద్, నూర్ బాషా సంఘం చైర్మన్ ఓతూర్ రసూల్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర డైరెక్టర్ హల్ గంగా ధర్‌రెడ్డి, జేసిఎస్ ఇంచార్జిలు పార్నపల్లి కిషోర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

రఘురామిరెడ్డి ప్రకటనపై నాయకుల్లో హర్షం

ప్రజాశక్తి - ఖాజీపేట

మైదుకూరు నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎస్.రఘురామిరెడ్డిని అధిష్టానం ప్రకటించడంపై శనివారం ఆ పారీ నాయకులు పలువురు హర్షం వ్యక్తం చేస్తూ.. బాణసంచా పేల్చారు. సంబరాలు చేసుకున్నారు. మండలం పరిధిలోని దుంపలగట్టు గ్రామంలో సర్పంచ్ రెడ్యం నాగవేణి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు రెడ్యం రామకృష్ణా రెడ్డితోపాటు పలువురు సంబరాలు చేసుకున్నారు. ఎ మ్మెల్యే అభ్యర్థిగా రఘురామిరెడ్డిని పార్టీ ప్రకటించడం సంతోషకరమన్నారు. ఎమ్మెల్యే గెలుపు కోసం తామంతా కష్టపడి పని చేసి అధిక మెజారిటీ తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కిషోర్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనలో నాయకులు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలం పరిధిలో పత్తూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామ లక్ష్మణ, ధ్వజ స్తంభం, విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమాల్లో భాగంగా శనివారం పలువురు నాయకులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు జరిగిన కార్యక్రమాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తిలకించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకుల ఆహ్వానం మేరకు మైదుకూరు టిడిపి ఇంచార్జి పుట్టా సుధాకర్ యాదవ్, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఏపీ ఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, టిడిపి మండలం అధ్యక్షులు లక్ష్మిరెడ్డి హాజరయ్యారు. వీరిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. పిచ్చి నాయుడు, ఉప సర్పంచ్ ముత్తూరు రమణ, రామ నాయుడు, పుల్లయ్య నాయుడు పాల్గొన్నారు.

చదువులో పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరుతేవాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మునిసిపాలిటీ పరిధి 15వ వార్డు యర్రగుడిపల్లిలో నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్‌ను శనివారం మున్సిపల్ వైసిపి ఇన్చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, కౌన్సిలర్ బొగ్గిటి పురుషోత్తం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నిర్మించారన్నారు. కార్యక్రమంలో కోడి రమణ, కో-ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి, రమణారెడ్డి, కౌన్సిలర్ కిషోర్, మాజీ కౌన్సిలర్ కోళ్ల భాస్కర్, రాజేశ్వరి కృష్ణమూర్తి, సూరి, డేనియల్ బాబు చంద్రమౌళి, నాగరాజు, సంపత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలను ప్రారంభిస్తున్న నాయకులు

ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

చెన్నకేశవస్వామి దేవస్థానం చైర్మన్‌గా నిరంజన్‌రెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో పురాతన దేవాలయమైన చెన్నకేశవ స్వామి ఆలయ నూతన చైర్మెన్‌గా ఎం నిరంజన్‌రెడ్డి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవాదాయ శాఖ సిబ్బంది కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. గతంలో కూడా నిరంజన్‌రెడ్డి చైర్మెన్‌గా బాధ్యతలు నిర్వహించారు. కమిటీ సభ్యులుగా నాగమణి, మహేశ్వరి, ఈశ్వరమ్మ, శేఖర్‌రెడ్డి, అనంతమ్మ, లక్ష్మీదేవి, సుదర్శనాచార్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ దేవస్థాన అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఆరోగ్య సంరక్షణకు వ్యాక్సిన్ తప్పనిసరి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆరోగ్యాన్ని కాపాడు కోవాలి అంటే వాక్సిన్ వేసుకోవడం చాలా ముఖ్యమని, పిల్లలకు టీకాలు రక్షణ కల్పిస్తుందని వైద్యాధికారులు డాక్టర్ హనీఫ్ బాబా, డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం కామనూరు పిహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో నాగయపల్లె, దొరసాని పల్లెలోని సెంటర్లలో నిర్వహించారు. ప్రతి సంవత్సరం మార్చి 16న నేషనల్ వాక్సినేషన్ డేగా జరుపుకొంటున్న సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీకాల వలన మశూచి పోలియో, ధనుర్వాతం వ్యాధులను అరికట్ట గలిగామన్నారు. ప్రజలు అందరూ టీకాలపై అవగాహనా కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తల సేవలను అభినందిచారు. యశోద సుప్రజ మహిళా ఆరోగ్య కార్యకర్తలను శాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ బిఎ వరప్రసాద్, చంద్రకళ, సీహెచ్‌ఓ దివ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మి నారాయణ, ఆశాలు బిందు, నాగలక్ష్మి, సుజాత, పుష్ప, లక్ష్మిదేవి, అంగన్వాడీ టీచర్స్ నాగలక్ష్మి కుమారి పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యకర్తలను సన్మానిస్తున్న వైద్యులు

పొంచి ఉన్న ప్రమాదం.. పట్టని అధికారులు

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని ఎర్రబొమ్మనుపల్లె పంచాయతీ కుమార్ కాలవ గ్రామం నివాసి అయిన కోనేటి విజయ్‌కుమార్, కోనేటి నాగేశ్వరరావు రైతుల పొలంలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. సర్వే నెంబర్ 12లోని పొలంలో ఆచుట్టూ ఉన్న గ్రామాలకు, పొలాలకు కరెంటు పెద్ద లైను పోతోంది. ఆ లైన్ ఆరు నెలల క్రితం పూర్తిగా ఒక పక్కకు వాలి పోయి ఉంది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు చాలాసార్లు విన్నవించారు. అయినా అదిగో చేస్తాం.. ఇదిగో చేస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక కరెంట్ స్తంభం పూర్తిగా వంగిపోయి ఉంది. మరో స్తంభంలోని కడ్డీలు కనబడుతున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు మార్చాలని రైతులు కోరుతున్నారు.

ఓవైపు వంగి ఉన్న స్తంభం, మరో స్తంభంలో కనిపిస్తున్న కడ్డీలు

పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలి

అంగన్‌వాడీ వర్కర్స్‌ను బెదిరించడం మానుకోవాలి : సిఐటియు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్

జమ్మలమడుగు రూరల్ : జిల్లావ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ వర్కర్స్‌కు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భవనాల్లో ఉన్న అంగన్వాడీ సెంటర్ల నిర్వహణకు రూ.3 వేలు అకౌంట్లో వేశారు. అయితే పీడీ మళ్లీ సూపర్వైజర్లు , సిడిపిఒల ద్వారా కట్టాలని హుకుం జారీ చేయడం, బెదిరించడం సమంజసం కాదని తెలిపారు. అలా కట్టని వారికి మెమో ఇచ్చి బెదిరింపు చర్యలకు పాల్పడడం దారుణమన్నారు. ఐసిడిఎస్ జిల్లా అధికారులు కక్షపూరిత చర్యలు మానుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను త్వరగా అందజేయాలని బి.మనోహర్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, నాయకులు ఎ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో సోమవారం నుంచి జరగబోయే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంఇఒ రవిశంకర్ తెలిపారు. చాపాడు, లక్ష్మీపేట పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. చాపాడు సెంటర్‌లో 300 మంది, లక్ష్మీపేట సెంటర్‌లో 127 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. రెండు పరీక్ష కేంద్రాలకు ఇన్విజిలేటర్లను కేటాయించామన్నారు. పరీక్షా సెంటర్లను నో మొబైల్ జోన్లుగా ప్రకటిం చామన్నారు. విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు వంటి వసతులను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులకు వైద్య సదుపాయం అందుబాటులో ఉంటుందన్నారు. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 వంశీకృష్ణ, సిఎస్, డిపార్ట్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎంఇఒలు

వైసిపి అరాచక పాలనకు స్వస్తి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన ఎన్నికల నోటిఫికేషన్‌తో ముగిసిందని జమ్మలమడుగు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి చదిపిరాల భూపేష్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయడంతో దేశవ్యాప్తంగా ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. ఇప్పటినుంచైనా అధికారులు పార్టీలకు అతీతంగా పనిచేయాలని కోరారు. ఈ సంధి కాలంలో అధికారుల పనితీరు ప్రజలకు, పార్టీలకు అద్దం పట్టేలా ఉండాలని కోరారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో నేటితో వైసిపి పాలనకు చరమగీతం పాడుతున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పొత్తులోని పార్టీలతో కలిపి విజయ దుందుభి మోగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాక్షస పాలన ముగిసి ప్రజా ఆమోదయోగ్యమైన పాలన జూన్ నుండి ప్రారంభమవుతుందన్నారు. ప్రజలకు మంచి జరిగే అవకాశాన్ని మే 13న ఓటర్లు ఎంచుకుంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన కో-ఆర్డినేటర్లు నల్లంశెట్టి నాగార్జున, దేరంగుల జగదీష్, టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

ఒక్క అవకాశమిస్తే అభివృద్ధి చూపిస్తా

ప్రజాశక్తి - చక్రాయపేట

తెలుగుదేశం పార్టీకి ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చూపిస్తామని పులివెందుల టిడిపి అభ్యర్థి బీటెక్ రవి తెలిపారు. మండలంలోని మహదేవపల్లి, బొజ్జ వాండ్లపల్లి, దళితవాడ, బాట్లోపల్లి, గంగారపు వాండ్లపల్లి, గొట్లమెట్ల గ్రామాల్లో శనివారం మండల ఇన్చార్జి తాళ్లపల్లి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీటెక్ రవి ఇంటింటిప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపికి ఓటు వేసి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పట్టం అశోక్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు ఎద్దుల చంద్ర, రామాంజనేయరెడ్డి, మాజీ ఉప మండలాధ్యక్షుడు నరసింహులు, క్లస్టర్ ఇంచార్జిలు యోగేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్ రెడ్డి, పరమేశ్వర, రమేష్, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నాగలగట్టుపల్లెలో పెట్రోల్ బంక్ ప్రారంభం

నాగలగట్టుపల్లెలో నయారా కంపెనీ పెట్రోల్ బంకును శనివారం పులివెందుల తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బీటెక్ రవి, మండల ఇన్చార్జి తాళ్లపల్లి మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంకు యజమాని దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ వాహనదారులకు 24 గంటలు పెట్రోలు, డీజిలు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తుడుములదిన్నె రాధాకృష్ణయ్య, తుపాకుల చంద్ర, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మహాదేవపల్లెలో ప్రచారం చేస్తున్న బిటెక్ రవి

పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వైసిపిలో 70 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మండలంలోని సున్నపురాళ్లపల్లి గ్రామంలో 20 కుటుంబాలు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరాయి. శనివారం సాయంత్రం గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ద్వారకచర్ల వినోద్‌రెడ్డితోపాటు 20 కుటుంబాలను పార్టీ కండువా వేసి ఆయన ఆహ్వానించారు. పట్టణ బిసి కాలనీలో కమటం రాముడు, సంజ్, సుబ్బన్నతో పాటు 50 కుటుంబాలు వైసిపిలో చేరాయి. అంతకుముందుగా పార్టీ అభ్యర్థులను ప్రకటించడంతో జమ్మలమడుగు నుంచి రెండవసారి ఎమ్మెల్యే మూలే సుధీర్‌రెడ్డికి టికెట్ దక్కింది. కార్యకర్తలు పెద్దఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వైసిపి నేతలు పొచిరెడ్డి, శ్రీను, బి. చంద్రమౌళి, వెంకటేష్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగింపు

ప్రజాశక్తి - పెద్దముడియం

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలు కావడంతో పెద్దపసుపుల గ్రామ సచివాలయాల్లో అమలు చేసిన సంక్షేమ పథకాల నోటీసులు, ఫెక్సీలను తొలగించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో వివిధ పార్టీల ఫ్లెక్సీలను కూడా తొలగించామని పెద్ద పసుపుల గ్రామపంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ నియమాలను పాటిస్తూ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు కానీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని సమావేశం ఏర్పాటు చేసి వారికి సూచించామని పేర్కొన్నారు. ఫ్లెక్సీల తొలగింపు కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బంది


పూజలో రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

గండి అంజన్న సన్నిధిలో పలువురు ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - చక్రాయపేట

జిల్లాలో ప్రసిద్ధి చెందిన గండి వీరాంజనేయ స్వామిని శనివారం రాజంపేట పార్ల మెంటు సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్ఆర్ జిల్లా జడ్పీ చైర్మన్ ఆకెపాటి అమ ర్నాథ్‌రెడ్డి, లక్కిరెడ్డి పల్లె జడ్పిటిసి సుదర్శన్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు దర్శించుకున్నారు. ప్రధాన అర్చకుడు కేసరి స్వామి, ప్రధాన అర్చకుడు రాజా స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం కావడంతో అన్న ప్రసాద వితరణ చేయించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుంద రెడ్డి, చైర్మెన్ కావలి క్రిష్ణతేజ తెలిపారు.

వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా యోబు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉప్పలపాటి యోబును ఆ పార్టీ నియమించింది. ఆ మేరకు శనివారం తాడేపల్లి నుంచి యోబు మాట్లాడుతూ తాను మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన వ్యక్తినని తెలిపారు. పార్టీని అంటిపెట్టుకొని సాధారణ కార్యకర్తగా ఇదివరకు పనిచేశానన్నారు. తన సేవను గుర్తించి జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో సుధీర్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు.

రాష్ట్రంలో మంచి పరిపాలన రావాలి

- మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

శనివారం ప్రకటించిన ఎన్నికల షెడ్యూల్‌తో రాష్ట్రంలో రాక్షస పాలన పోయిందని, త్వరలోనే ప్రజల మద్దతుతో రామరాజ్యం వస్తుందని మాజీ ఎమ్మెల్సీ బచ్చలు పుల్లయ్య తెలిపారు. శనివారం స్థానిక నంద్యాల వరదరాజులరెడ్డి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019లో ప్రజావేదిక కూల్చడంతో ప్రారంభించిన పాలన రాజరిక దురహంకార పాలనకు నేటితో తెరపడిందన్నారు. అన్ని రంగాలు అట్టడుగు స్థానానికి వెళ్లాయన్నారు. రాబోయే టిడిపి ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, మార్తల ప్రవీణ్‌కుమార్ రెడ్డి, రాజశేఖర్, జిలాన్ పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరుకు చెందిన భాస్కర్(70) అను అనాథ శవానికి మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. భాస్కర్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ 3రోజుల క్రితం మరణించాడు. ఆసుపత్రి సిబ్బంది పత్రిక ప్రకటన ఇచ్చినప్పటికీ ఎవ్వరూ స్పందించకపోవడంతో ఫౌండేషన్ నిర్వాహకులకు సమాచారమివ్వగా స్పందించిన నిర్వాహకులు హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

శ్రీపొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం పులివెందుల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గుప్తా మెడికల్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రెసిడెంట్ సకల మహేంద్ర, కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్త రవికుమార్, దినేష్ గుప్తా, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మెడికల్ స్టోర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం

ఆదర్శప్రాయుడు పొట్టి శ్రీరాములు

ప్రజాశక్తి - చాపాడు

అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయుడని గ్రంథాలయ అధికారి శివశంకర్‌రెడ్డి తెలిపారు. పొట్టి శ్రీరాములు 123వ జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ సావిత్రమ్మ, వెలుగు ఎపిఎం వెంకటరమణ, వెలుగు సిసిలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **మైదుకూరు :** భాషా ప్రయుక్త రాష్ట్రాల పితామహుడు పొట్టి శ్రీరాములు అని ఉపాధ్యాయుడు యాపరాల అంకన్న అన్నారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ఎంపీపీ తెలుగు మీడియం పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పొట్టి శ్రీరాములు గురించి, ఆశయాలను వివరించారు. విద్యార్థులు మహనీయుల గురించి తెలుసుకోవాలన్నారు. **ప్రొద్దుటూరు :** ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు గొప్పదేశ భక్తుడని మే ఐహెల్ప్‌యు ఫౌండేషన్ చైర్మెన్ లక్షణ్‌మోరే అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక లైట్‌పాలెం సర్కిల్‌లో ఉన్న శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రీరాములు, ఫౌండేషన్ కోశాధికారి భార్గవ్‌సాయి మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి తిరుపాల్, సభ్యులు వరలక్ష్మి, ముని, కుమారస్వామి పాల్గొన్నారు. **కడప అర్బన్** : ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ బి.ఆంజనేయ ప్రసాద్ అన్నారు. విశ్వవిద్యాలయంలో శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విసి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్ కుమార్ రెడ్డి, నేషనల్ ఈవెంట్ కోఆర్డినేటర్ మనోహర్ రావ్, జాతీయ సేవా పథక ప్రోగ్రామ్ ఆఫీసర్లు,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **బద్వేలు :** పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య వర్తక సంఘం, మహిళా మండలి, ఆవోప, ఆవోప మహిళా విభాగం, వాసవి క్లబ్, వనిత క్లబ్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జయంతి ఉత్సవాలను నిర్వహించారు. అందులో భాగంగా ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య వర్ధక సంఘం ఉపాధ్యక్షులు మునగా చలమయ్య, దర్శి వెంకటేశ్వర్లు, సభ్యులు కొప్పరపు వైభవ్ ప్రసాద్, జొన్నలగడ్డ సుధాకర్, చాటుకొండ వెంకటసుబ్బయ్య, దుగ్యాల సత్యం, సముద్రాల పుల్లయ్య, రమణ, కార్యదర్శి చాటకొండు నాగేశ్వరరావు, వాసవి క్లబ్ అధ్యక్షులు భార్గవ్, కార్యదర్శి సుధాకర్, మహిళా మండలి అధ్యక్షులు దేవతి లలిత, మాజీ అధ్యక్షురాలు చింతకుంట ధనమ్మ, ప్రజా సంఘాల నాయకులు గురుమూర్తి, బ్రహ్మయ్య, టీచర్ పుల్లం రాజు, కాల్వపల్లె సుబ్బారావు, గంగసాని సాంబశివరెడ్డి పాల్గొన్నారు. **జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..** ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ సత్తార్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుశీల్ కుమార్, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ, సమాచారపు చట్టం జిల్లా అధ్యక్షులు మామిళ్ళ నరసింహులు, అన్నమయ్య జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అఖిల్, సయ్యద్ ఆయుబ్, షేక్ కరీముల్లా, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

ప్రజాశక్తి - ముద్దనూరు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవచ్చని సిఐ దస్తగిరి పేర్కొన్నారు. మండలంలోని వేల్పుచెర్ల, ఉప్పలూరు, చింతకుంట, యామవరం, కొర్రపాడు గ్రామాల్లో శనివారం సిఐ ఆధ్వర్యంలో పారా మిలిటరీ బలగాలు, పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వియోగించుకోవచ్చన్నారు. ఎలాంటి ప్రలోభాలకు, భయబ్రాంతులకు గురి కావద్దన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - మైదుకూరు

మండల పరిధిలోని ఒనిపెంట మహాత్మా గాంధీ జ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలలో శనివారం శ్రీ గాయత్రి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 10వ తరగతి చదువుతున్న 70 మంది విద్యార్థినులకు పరీక్షా సామగ్రి (ఒక్కొక్కరికి ప్యాడ్, జామెట్రీ బాక్స్, 5పెన్నులు, స్కేల్, పెన్సిల్)పంపిణీ చేశారు. శ్రీ గాయత్రి సేవా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నిగినే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలన్నారు. ట్రస్ట్ సభ్యులు మధు, వెంకటేష్, నారాయణ, సురేష్ బాబు, పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృషభాచలేశ్వర స్వామి ఆలయాల హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక వృషభాచలేశ్వర స్వామి అనుసంధానమైన ఆలయాల హుండీ లెక్కింపును నిర్వహించినట్లు ఇంచార్జ్ ఈవో ఆర్.విశ్వనాథరెడ్డి తెలిపారు. శనివారం పర్యవేక్షణ అధికారి మారుతి ప్రసాద్ యాదవ్ సమక్షంలో ఆలయ అనుసంధానమైన వెంకటేశ్వరస్వామి ఆలయం, వీరాంజనేయ స్వామి ఆలయం, వృషభాచలేశ్వర స్వామి ఆలయాల హుండీల లెక్కింపు నిర్వహించగా.. రూ.2.65 లక్షలు ఆదాయం వచ్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది 2023 మార్చి నుంచి ఇప్పటివరకు ఈ ఆదాయం లభించిందని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి మరింత కృషి చేస్తామని తెలిపారు. ఆలయ చైర్మన్ కురాకుల వెంకటేష్, పాలకమండలి సభ్యులు అరవింద్, బాలాజీ, శ్రీనివాసులు, సిద్ధారెడ్డి జూనియర్ అసిస్టెంట్ రంగప్రసాద్, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

30 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని దేనేపల్లి గ్రామంలోని చావిడి దగ్గర అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నల్లబోయిన రామసుబ్బయ్యను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ దస్తగిరి తెలిపారు. వీటి విలువ రూ.3,900 ఉంటుందన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPLE JUNIOR CIVIL JUDGE, KADAPA

O.S.No. 990/2020

Gongala Reddy Vara Lakshmi, W/o Venkateswara Reddy, resident of : D.No.39/435-1, Vivekananda Nagar, Kadapa City, Y.S.R.Kadapa District.

...Plaintiff

Vs

Vemula Madhavi Latha, W/o Vemula Brahmaiah, Resident of D.No.39/435-1-1, Ist Floor, Vivekananda Nagar, Kadapa City, YSR Kadapa District.

...Defendant

NOTICE

The above referred the plaintiff has filed suit for recovery in O.S.No.990/2020, on file of Hon'ble IIIrd Addl.Junior Civil Judge Kadapa against you and same is posted for your appearance on 28.03.2024, at 10.30 A.M, if you're not appear before the Hon'ble Court, the Hon'ble court will take appropriate steps against you.

//By Order of the Hon'ble Court//

GVENKATESWARA REDDY,
Advocate,
Kadapa.